సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్

మూలనపడ్డ 'మట్టి' పరీక్ష..!

మూతపడిన భూసారపరీక్ష కేంద్రం

- ఏళ్లుగా తెరుచుకోని భూసారపరీక్ష కేంద్రం
- మట్టి పరీక్షలకు అనంతకు రైతుల పరుగులు
- అన్నదాతకు ఉపయోగపడని అగ్రిటెస్టింగ్ ల్యాబ్
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ

రైతులు తమ భూముల మట్టి పరీక్ష చేయించుకోవడం చాలా ముఖ్యం. పోషకాలు అధికంగా ఉండే నేల మొక్కలు పెరగడానికి, అభివృద్ధి చెందడానికి, సమవృద్ధిగా పంటు పండించడానికి అవసరమైన ముఖ్యమైన అంశాలను అందిస్తుంది. భూసార పరీక్షల ద్వారా పోషకాలు తక్కువగా ఉన్న నేలలను గుర్తించి రైతులు వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవచ్చు. ఎరువుల అవసరం గురించి అవగాహన కల్పిస్తుంది. పర్యావరణాన్ని రక్షిస్తుంది. మట్టి పరీక్ష ద్వారా పోషకాలు తక్కువగా ఉన్న భూమిని గుర్తించవచ్చు. తద్వారా రైతులు సరైన ఎరువులను వాడవచ్చు. పర్యావరణ కాలుష్యాన్నీ నివారించవచ్చు. ప్రజలు, రైతులకు ఉపయోగపడే భూసార పరీక్షలు పెనుకొండలో చేయాలంటే గగనమైపోయింది. అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లుగా భూసా పరీక్ష కేంద్రం మూతపడింది.

మట్టి పరీక్షలకు అనంతకు పరుగులు..

మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రం మూతపడింది. రైతుల పొలాల్లో మట్టి నాణ్యత పరీక్షించుకోవాలంటే అనంతపురానికి పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. డివిజన్ కేంద్రంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రంలో రొద్దం, సోమందేపల్లి, పెనుకొండ తదితర మండలాలను రైతులు మట్టి పరీక్షలు చేయించుకునే వారు. అధికారుల నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా ఈ కేంద్రం మూతపడిపోయింది. రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలంటే అనంతపురం వెళ్లాలి. పేద రైతులు సొంతంగా డబ్బు ఖర్చు పెట్టుకుని మట్టి పరీక్షలు చేయించుకోలేని పరిస్థితులున్నాయి. భూసారం తెలీక సాగు చేసిన పంటలు దిగబడి రాక నష్టపాలౌతున్నారు. పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్నారు. మట్టి పరీక్షలు చేసి అవసరమైన ఎరువులు ఉపయోగిస్తే అధిక దిగుబడి వచ్చి రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ఏళ్లుగా మూతపడిన భూసారపరీక్ష కేంద్రం

డివిజన్ కేంద్రంలో ఉన్న భూసారపరీక్ష కేంద్రం గత ప్రభుత్వ హయాంలో మూతపడింది. అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల పేరుతో నూతన భవనాలు నిర్మించి, పాత పరీక్ష కేంద్రాలను మూతవేశారు. భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయశాఖ ఏడీ పర్యవేక్షణలో ఉంటుంది. ఇందులో ఒక వ్యవసాయ అధికారి, ఏఈఓలు పని చేస్తారు. ప్రస్తుతం మూతపడిని కేంద్రంలో ఉన్న మట్టి పరీక్షల పరికరాలు పాడైపోయాయి. అధికారులు అలసత్వంతో రైతులు ఇబ్బందులు పడాల్సివస్తోంది.

రైతులకు ఉపయోగపడని అగ్రిటెస్టింగ్ ల్యాబ్..

మార్కెట్ యార్డు అవరణలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ రైతులకు ఉపయోగపడడం లేదని పలు విమర్శలున్నాయి. టెస్టింగ్ ల్యాబ్ పెనుకొండలో ఉన్న మట్టి నమునాలకు పరీక్షలు చేయడంలేదు. దీంతో రైతులు మట్టి తీసుకుని అనంతపురంకు పరుగులు పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం 2021లో ఈ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ రూ.62 లక్షలతో నిర్మించింది. ఇందులో వ్యవసాయ అధికారి ఇతర సిబ్బంది పని చేస్తున్నారు. ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, మట్టి నమునాలు పరీక్షలు నిర్వహించాల్సిఉంది. ప్రస్తుతం కేవలం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల నమునాలు మాత్రమే పరీక్షిస్తున్నారు.

పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

భూసార పరీక్షలు చేయించడంలో వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మట్టి పరీక్షలు ద్వారా రైతుల పంటలకు అధిక దిగిబడి వచ్చేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అధికారులు విఫలమౌతున్నారు. ఫలితంగా రైతులు తీవ్రగా నష్టపోతున్నారు. మట్టి పరీక్షలు చేయించాలంటే ఖర్చుతో కూడుకున్న పని. అంత మొత్తం ఖర్చు చేసి స్థితిలో రైతులు లేరు. ప్రభుత్వం ఉచితంగా మట్టి పరీక్షలు చేసి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తోంది. రైతులకు మేలు చేయాల్సిన అధికారులు వారిని విస్మరిస్తున్నారు.

రైతులకు ఉపయోగపడని అగ్రిటెస్టింగ్ ల్యాబ్

భూసార పరీక్షలు నిర్వహించాలి

అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. భూసా పరీక్షలు ఇదే ల్యాబ్‌లో నిర్వహించాలి. మూతపడిన భూసార పరీక్షల కేంద్రం ప్రారంభించాలి.

హరి, రైతు సంఘం నాయకులు.

భూసార పరీక్ష కేంద్రం ప్రారంభించాలి

పెనుకొండలో మూతపడిన భూసార పరీక్ష కేంద్రం తిరిగి ప్రారంభించాలి. రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులకు మేలు చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి.

రైతు శివయ్య, మావటూరు.

ఇళ్ల పట్టాలిచ్చే వరకు పోరాటం

- పేదలకు అండగా న్యాయస్థానాలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రాంతంలో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చేంత వరకు సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు. పేదలకు అండగా పాలకులు, అధికారులు నిలవక పోయినప్పటికీ న్యాయస్థానాలు అండగా ఉన్నాయని ఏ ఒక్కరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. హిందూపురం పట్టణంలో వివిధ ప్రాంతాలకు చెందిన వందలాదిమంది సొంత ఇల్లు లేని పేదలు సిపిఎం ఆధ్వర్యంలో భూ స్వాధీన పోరాటం చేపట్టారు. పట్టణ సమీపంలోని కొల్లకుంట వద్ద గుడిసెలను వేసుకున్నారు. ఈ గుడిసెలను రాత్రికి రాత్రే పోలీసులను అడ్డుపెట్టుకుని అధికారులు తొలగించారు. అయినా పోరాటపటిమని వీడని పేదలు మళ్లీ గుడిసెలు వేసుకుని అక్కడే నివాసముంటూ, న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పరిశీలన చేసిన న్యాయస్థానం సర్వే నెంబర్ 21-3, 21-4, 21-5, 21-6లో గుడిసెలు వేసుకున్న 447 మందికి ఇంటి పట్టాలను మంజూరు చేయాలని అధికారులకు సూచించింది. ఈ తీర్పు మేరకు సోమవారం నాడు సిపిఎం కాలనీలో విజయోత్సవ సభను కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా వి.రాంభూపాల్ హాజరై మాట్లాడారు. హిందూపురం పట్టణంలో దాదాపు 15 సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు సొంత ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాన్ని కేటాయించలేదన్నారు. పట్టణంలో దాదాపు 18 వేల మంది వరకు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారని చెప్పారు. పేదలకు అండగా నిలిచిన సిపిఎం ఇళ్ల లేని నిరుపేదలతో కలిసి పట్టణ సమీపంలోని కొల్లకుంట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో భూ పోరాటం ద్వారా గుడిసెలను వేసుకున్నారని తెలిపారు. పేదలకు అండగా నిలవాల్సిన ప్రజా ప్రతినిధులు అండగా నిలువకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని అధికారులను ఉసిగొల్పి రాత్రికి రాత్రే గుడిసెలను కూల్చి వందలాది మందిని నిరాశ్రయులుగా మార్చిందన్నారు. ఆ సమయంలో న్యాయం కోసం ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక న్యాయస్థానాన్ని ఆశ్రయించిందన్నారు. పరిశీలన చేసిన న్యాయస్థానం నాలుగు నెలలలోపు పేదలందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలని అధికారులకు సూచించిందన్నారు. అయినప్పటికీ అధికారులు ఇంటి స్థలాలను కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, వీధి దీపాలు, నీటి సౌకర్యాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికీ పట్టాలు సాధించేవరకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈఎస్.వెంకటేష్, జెడ్పీ.శ్రీనివాసులు, జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, స్థానిక నాయకులు రాము, రామకష్ణ, నరసింహ, రామాంజి, రాయుడు, రాజప్ప, సరస్వతమ్మ, చంద్రమ్మ, నాజియా, సునీత, చంద్రమ్మ, అంజలి, శశికళ, ఆదిలక్ష్మి, కిరణ్ పాల్గొన్నారు.

బాధ్యతగా అర్జీల పరిష్కారం

కలెక్టర్ టిఎస్.చేతన్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బాధ్యతగా స్వీకరించి వాటిని పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణతో కలిసి ప్రజల నుంచి 172 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని త్వరగతిన పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన వినతులనూ పరిష్కరించాలన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులకు రాష్ట్రస్థాయి కెపిఐ శిక్షణ కార్యక్రమం ఈనెల 14న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెలవారీ కార్యాచరణ ప్రణాళిక నివేదికలు లక్ష్యాలను అధిగమించే విధంగా సిద్ధం చేయాలన్నారు. జూన్ 5న జిల్లా అంతట విరివిగా మొక్కలు నాటాలని, ఇందుకు ఎన్ని మొక్కలు అవసరమో మంగళవారం లోపు అటవీశాఖ జిల్లా అధికారికి నివేదికలు అందజేయాలన్నారు. ఈనెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర థీమ్ భావన వేడిని తగ్గించడం అనే కార్యక్రమంపై విస్తతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం.నాగరాజు, పశుసంవర్ధక శాఖ జెడి శుభాదాసు, సిపిఒ విజయ్ కుమార్, ఉద్యానవన శాఖ చంద్రశేఖర్, ఎస్‌సిహెచ్ఒ తిప్పేంద్ర నాయక్, డిఎఫ్ఒ చక్రపాణి, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, డిపిఒ సమత, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, డిఎంహెచ్ఒ ఫిరోజ్ బేగం, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై గోడౌన్ స్టాకిస్ట్ దుర్గేష్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న వర్కర్లు

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-పెనుకొండ

కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 20వ తేదీ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొంటున్నామని తెలుపుతూ సోమవారం పట్టణంలోని సివిల్ సప్లై గోడౌన్ స్టాకిస్టు దుర్గేష్‌కు కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింట్స్ హమాలీలకు ఈఎస్ఐ అమలుకు ఆటంకంగా ఉన్న కోర్టు కేసులను ఉపసంహరించాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, తదితర సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయా డిమాండ్లపై ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుధాకర్, హనుమంతు, బాబు, సలీం, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం

బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీవాసులు మంత్రి సవితకు తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను వారు మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి తాగునీటి సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. వైసిపి హయాంలో తన తండ్రి పేరుపై వైఎస్ఆర్ కాలనీ పెట్టిన అప్పటి సిఎం జగన ఆ కాలనీలో కనీసం సౌకర్యాలు కల్పించలేదని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ వైసిపిలో ప్రతి ఐదేళ్లకు ఓ సారి వలస పక్షులు వచ్చి దోచుకుని వెళ్తున్నారే తప్ప ప్రజల గురించి పట్టించుకోలేదన్నారు. కాలనీలోని ఇతర సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు యాదవ్, కౌన్సిలర్ గిరి, నాయకులు దేవేంద్ర, బాబుల్‌రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆవరణలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ జాబ్‌మేళాలో 60 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 2వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తార న్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, బి.టెక్, పిజి చదివిన వారు అర్హులన్నారు. 18-35 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకూ వేతనం ఉంటుందని వివరించారు.

వైఎస్ఆర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఘనంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు జన్మదిన వేడుకలు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను మంత్రి సవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంత్రి కార్యాలయంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షునిగా ఆయన సేవలు అసామాన్యం, రాజకీయ జీవితం ఎందరికో మార్గదర్శకం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, టిడిపి పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు శ్రీరాములు యాదవ్, సిద్దయ్య, మాజీ జడ్పిటిసిలు చిన్నప్పయ్య, వెంకటరమణ, నాయకులు కృష్ణమూర్తి, బాబుల్ రెడ్డి, రఘువీరాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

వీరజవాను మృతికి నివాళిగా ర్యాలీ

ప్రజాశక్తి-గుడిబండ

దేశ సరిహద్దులో శత్రు దేశం పాకిస్తాన్ జరిగిన కాల్పుల్లో గోరంట్ల మండలంలోని కళ్లితండాకు చెందిన అగ్నివీర్ జవాను మురళీనాయక్ వీరమరణం పొందిన విషయం తెలిసిందే. వీరజవాను మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ సోమవారం గుడిబండలో వివిధ పార్టీల నాయకులు, మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మహిళలు వీరజవాను మురళీనాయక్ బ్యానర్‌ను చేతపట్టుకొని వీధుల్లో ప్రదర్శన చేపట్టి బస్టాండ్ ప్రాంతానికి చేరుకొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అక్కడ చిత్రపటం ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మురళీనాయక్ దేశం కోసం తన ప్రాణాలనే త్యాగం చేశారని కొనియాడారు. యువత మురళీనాయక్‌ను ఆదర్శంగా తీసుకొని దేశ సేవలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు వీరజవాను కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి కరుణాకర్, వైసిపి మండల కన్వీనర్ డిఎల్.ఎంజేరేగౌడ్, మాజీ ఎంపిపి ఎల్‌కె.నరసింహప్ప, ఎంపిటిసి వనజ శశిధర్, గిరిధర్‌నాయక్, రాయుడు, మహిళా సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిటిని పరిరక్షించండి : ప్రజా సంఘాల జెఎసి

ప్రజాశక్తి-మడకశిర

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి)ను పరిరక్షించాలని ప్రజా సంఘాల జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఆర్‌డిటికి విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్‌సిఆర్ఎను రెన్యువల్ చేయలని కోరుతూ సోమవారం సిపిఎం, సిపిఐ, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, డిహెచ్‌పి ఎస్, బిసివి, పిడిఎస్‌యు, ఎపి ఎంఆర్ పిఎస్, ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్‌డిటిని పరిరక్షించాలని నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ శివరామకృష్ణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగార్జున, డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు మాట్లాడుతూ ఆర్‌డిటి సుమారు 55 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతుందని తెలిపారు. మాట్లా డుతూ ఆర్‌డిటి లక్షలాది పేద కుటుంబాలకు శాశ్వత గృహాలు నిర్మించిందన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించిందన్నారు. క్రీడల్లో ప్రోత్సహిస్తుంద న్నారు. ఆర్‌డిటి ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఇలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులను అడ్డుకోవడం దారుణమన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ మురళీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనప్ప, నారాయణప్ప, కెంచప్ప, ఎం.శ్రీనివాస్, రామంజి, ఉమేష్‌నాయక్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన

గోరంట్ల : ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఎంఆర్‌డి సరోజమ్మ కళాజాత బృందం పట్టణంలో హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక బస్టాండ్ వద్ద కళాజాత బృందం సభ్యులు వీధి నాటకం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోరంట్ల వైద్య సిబ్బంది, జన జాగృతి పియు పెనుగొండ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు, ఎంఈఓ అశోక్, ఎఎన్ఎం హరిత, ఓఆర్‌డబ్ల్యు నీల, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మృతి

ప్రజాశక్తి-అనంతపురం, ఉరవకొండ



దరూరు పుల్లయ్య

అనంతపురం మాజీ ఎంపీ ధరూరు పుల్లయ్య(86) సోమవారం నాడు బళ్ళారిలో తుది శ్వాసవిడిచారు. ఉరవకొండ నియోజక వర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం ఆయన స్వగ్రామం. 1939 జూన్ 20వ తేదీన ఆయన జన్మించారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం ఉన్నారు. 1977, 1980ల్లో అనంతపురం ఎంపీగా గెలుపొందారు. ఎంపీగా ఉన్నప్పుడు సాగునీరు, తుంగభద్ర జలాలు, హంద్రీనీవా, కరువు నివారణ కోసం ఎంతో కృషి చేశారు. ఈయన మృతిపై పలువురు నివాళి అర్పించారు. నీటి మళ్లింపుతోనే రాయలసీమ సస్యశ్యామలం అతుందని ప్రజాతంత్ర శక్తులతో కలిసి ఎన్నో పోరాటాలు సాగించారు. అనంతపురం నగరంలో ఏపీ లైటింగ్స్ పరిశ్రమను స్థాపించి ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. రెండుసార్లు ఎంపీగా గెలిచి అనంతపురం పార్లమెంటును ప్రగతి పథాన నడిపించేందుకు కృషి చేశారు. సిద్ధాంతాలు వేరైనా జిల్లా అభివృద్ధి కోసం పార్టీలు పక్కన పెట్టి, కమ్యూనిస్టు పార్టీ యోధుడు వికె.ఆదినారాయణ రెడ్డితో కలిసి పని చేశారు. ఆ కారణంగా అతని మరణానంతరం వికె.ట్రస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు ఆయన పేరు మీదుగా వికె.ట్రస్ట్ భవనం నిర్మాణానికి తోడ్పాటు అందించారు.

నిబద్ధత కలిగిన నేత : విశ్వేశ్వరరెడ్డి

దరూరు పుల్లయ్య నిబద్ధత కలిగిన నేత అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. అనంతపురం పార్లమెంట్‌తో పాటు ఉరవకొండ నియోజకవర్గం, వజ్రకరూరు మండలం, ఛాయాపురం గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన ఒక తరం నాయకున్ని కోల్పోవడం బాధాకరం అన్నారు.

దరూరు పుల్లయ్య మతికి సిపిఎం నివాళి

అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మృతికి సిపిఎం నివాళి అర్పించింది. ఈ మేరకు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ ప్రగాఢ సంతాపం తెలిపారు. దరూరు పుల్లయ్య జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం విశేషమైన కషిచేసిన గొప్ప నేత అన్నారు. ప్రముఖ ఇంజినీర్ శ్రీ రాధాకృష్ణయ్యతో కలిసి జిల్లా సాగునీటి వనరుల అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ అయినప్పటికీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై కమ్యూనిస్టు పార్టీలతో చర్చించడం, అభిప్రాయాలను పంచుకోవడంలో ఆదర్శనీయమైన కషి చేశారని కొనియాడారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే

అమడగూరు : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత టీడీపీ కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. అమడగూరు టీడీపీ కమిటీ ఎంపికపై సోమవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. టిడిపి ఎన్నికల కమిటీలో ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయానికి పని చేయాలని పిలుపునిచ్చారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, వలిపి శ్రీనివాసులు, రాష్ట్ర డైరెక్టర్ కాలేనాయక్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కృష్ణమూర్తి, ఎల్ఐసి నరసింహులు, డైరీ శ్రీనివాసులు, భాస్కర్ డాక్టర్ రవికుమార్, సిద్దు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ నజీమున్నీసా, వైస్ ఛైర్‌పర్సన్లు రాజశేఖర్‌రెడ్డి, కొమ్ము గంగాదేవిపై గత నెలలో పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఖాళీ అయిన ఆయా స్థానాలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఈ నెల 15వ తేదీ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, 19న కొత్త ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎట్టకేలకు నోటిఫికేషన్ వెలువడడంతో కదిరి మున్సిపాలిటీ పీఠంపై కన్నేసిన ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

కరాటేతో ఆత్మస్థైర్యం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కరాటే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపుతుందని మాస్టర్ అక్బర్ అలీ అన్నారు. ఆదివారం అనంతపురం జిల్లా పామిడి ప్రభుత్వ హైస్కూల్లో మాస్టర్ విక్టర్ నిర్వహించిన అనంత డ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ సెల్ఫ్ డిఫెన్స్ అండ్ లోగో ఆవిష్కరణ ప్రోగ్రాంలో ఉమ్మడి జిల్లా నుంచి కరాటే మాస్టర్లు పాల్గొని వారి విద్యార్థులతో సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం అండ్ ఫిజికల్ ఫిట్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా కదిరి కరాటే మాస్టర్ అక్బర్ అలీ విద్యార్థులు పాల్గొనిసెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫైట్ మాస్టర్ అశోక్ హాజరయ్యారు. విద్యార్థులు కరాటే విన్యాసాలను అబ్బురపరచాయి. మొహమ్మద్ అసాద్. హానిక రాయల్. భవ్య. మోక్షిత్. బద్రి అనే విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైట్ మాస్టర్ అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు మహబూబ్ బాషా, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని టేకులోడు పంచాయతీ ఆరుమాకులపల్లిలో నూతన అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, సురేంద్రబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ నూతన భవనాన్ని కియా, ఆర్డిటి సంస్థల సహకారంతో సుమారు 22 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కియా ఆర్ డి టి సంస్థల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కియా, ఆర్డిటి సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ పిల్లల విద్య, సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నాణ్యమైన వసతులతో ఈ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, తిప్పారెడ్డి, నందీశప్ప, బయప రెడ్డి, రాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తూనికలు కొలతలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

వ్యాపారులు, వినియోగదారులు తూనికలు కొలతలపై అవగాహన పెంచుకోవాలని ఆ శాఖ ఇన్స్ పెక్టర్ జి.శివశంకర్ తెలిపారు. ప్రపంచ తూనికలు కొలతల శాఖ వారోత్సవాలలో భాగంగా సోమవారం వ్యాపారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన ప్రపంచ తూనికలు కొలతల శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రాంతాల్లో వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం సంతేబిదనూరులో ఆంజనేయ స్వామి బ్రహ్మరథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుండి దేవాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామాంజి, బిసలమానేపల్లి వేణు, నర్సింహా రెడ్డి, బిసమానేపల్లి సర్పంచి నాగేంద్ర, చలపతి, హనుమంతరాయప్ప, మధు స్వామి, విద్యార్థి సంఘం నాయకులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమస్యలపై సకాలంలో స్పందించాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

తల్లిదండ్రులు వారి పిల్లల సమస్యలపై సకాలంలో స్పందించినప్పుడే మంచి ఫలితం ఉంటుందని సిడిపిఒ శ్రీ లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఐసిడిఎస్ జిల్లా బాలల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల సమస్యలు గురించి సకాలంలో స్పందించాలన్నారు. పిల్లల కోసం సమయం కేటాయించకపోతే జరిగే పరిణామాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, సూపర్‌వైజర్ అరుణ, కౌన్సిలర్ శివలత, యూత్ అంబాసిడర్ సంజీవరాయుడు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్పఆలయంలో అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల కేంద్రానికి సమీపంలో ఎం.కొత్తపల్లి బండపై ఉన్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామివారి ఆలయంలో జూన్ 6వతేదీ అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో తహశీల్దార్ అనంతచారి,ఎంపిడివో రాబర్ట్ విల్సన్,సొసైటీ బ్యాంక్ మేనేజర్ వెంకటాచలం సమక్షంలో అక్షరాభ్యాసం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు, గురుస్వామి మాట్లాడుతూ అక్షరాభ్యాసం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో తల్లిదండ్రులతో పాల్గొనే చిన్నారులకు ఫౌండేషన్ చైర్మన్ కోడూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉచితంగా పలక,బలపం అందిస్తారని, తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి, ఎఎస్ఐ వెంకటరాముడు,మాజీ సొసైటీ అధ్యక్షులు పిట్టా ప్రభాకర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సత్యవతి, విఆర్ఒలు బాలప్ప, దాదాపీరా, ఆలయ సేవకులు బ్యాంకు శీను,శేషు, విశ్వనాథ్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జెడ్పి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం కార్మికవ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ నిలిపి వేయాలని, సమాన పనికి సమాన వేతనం తదితర డిమాండ్ల పరిష్కారానికై మే 20న సమ్మె చేయాలని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు.. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ,ఆఫీసు బేరర్స్ జి ఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, దిల్షాద్, శ్రీదేవి, సౌభాగ్య, సాంబశివ తో పాటు జిల్లా నాయకులు ఆంజనేయులు, ఓబిరెడ్డి, జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి సమ్మె నోటీసును సిఐటియు నాయకులు ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జె వి రమణ, కో కన్వీనర్ టి అయూబ్ ఖాన్, సంఘం అధ్యక్ష కార్యదర్శులు యం బాబు, ముకుంద మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలను కాపాడాలని ప్రైవేటీకరణ రద్దు చేయాలని తదితర ప్రధానమైన డిమాండ్లతో సిఐటియు ఇతర ప్రజా సంఘాలతో ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను చేపట్టిందన్నారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : దేశవ్యాప్తంగా ఈ నెల 20న కార్మికులు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఈరేష్, నామాల నాగార్జున తెలిపారు. సోమవారం హిందూపురం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈరేష్ , నామాల నాగార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. ప్రభుత్వ సంస్థలను కాపాడాలని ప్రైవేటీకరణ రద్దు చేయాలని తదితర ప్రధానమైన డిమాండ్లతో సిఐటియు ఇతర ప్రజా సంఘాలతో ఈ నెల 20 తేదీన దేశవ్యాప్త సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమ్మెకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విష్ణు, కన్వీనర్ అఫ్రిది, కో కన్వీనర్ అజ్మల్,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ తెలిపారు. కొత్త చెరువులోనే డీఈవో కార్యాలయం వద్ద సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జయచంద్రారెడ్డి, సుధాకర్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పునర్వ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు స్పష్టమైన జీవో లేకుండానే. రోజుకు ఒక ఆలోచన జరుగుతున్నందున ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయులతో సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. జీవో 117 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త జీవోను విడుదల చేసి పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు అన్ని మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ఐదు తరగతులను బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల సంఖ్య 75కు మించితే అక్కడ హెచ్ఎం పోస్టు అదనంగా కేటాయించాలని కోరారు. అలాగే విద్యార్థుల సంఖ్య 120 కి మించితే ఆరవ ఎస్ జి టి కేటాయించాలన్నారు. రెండు లాంగ్వేజ్ పోస్టులు. రెండు నాన్ లాంగ్వేజ్ పోస్టులను కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తరగతి గదిలో 45 మంది కంటే ఎక్కువ ఉంటే సపరేటు సెక్షన్ ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అనంతరం డిఇఒ కిష్టప్పకు వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు భూతన్న, సహాధ్యక్షులు బాబు, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, తాహీర్ వలి, శివశంకర్, అనిల్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు మారుతి, శ్రీనివాస్‌తో పాటు యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఒల నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వైద్య ఆరోగ్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో సిహెచ్ఒలు చేపట్టిన శాంతియుత ధర్నా సోమవారం నాటికి 15వ కు చేరుకుంది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన సిహెచ్ఒలు డిఎం హెచ్ఒకార్యాలయం ముందర ఉదయం 9 గంటల నుండి నాలుగు గంటల వరకు శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నారు. సమస్యలను జిల్లా అధికారులకు మంత్రులకు విన్నవించుకున్నా ఫలితం కన్పించలేదని వారు వాపోయారు. గోరంట్ల మండల పర్యటనకు ఆదివారం వచ్చిన మంత్రి లోకేష్‌కు పుట్టపర్తి విమానాశ్రయంలో తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేస్తే సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపి వెళ్లారని చెప్పారు. అయితే ఇది జరిగి 24 గంటలు గడిచిన నేటికీ ఎలాంటి సమాచారం లేదని వారు వాపోయారు. శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 379 మందిలో కేవలం 30 మంది పురుషులు తప్ప మిగిలిన వారంతా మహిళలేనని మహిళలు రోడ్డు మీదకు వచ్చి 15 రోజులు గడుస్తున్న ప్రజాప్రతినిధులు ,అధికారులు స్పందించకపోవటం దారుణమన్నారు. 8 నెలల నుండి ఇన్సెంటివ్ ఇవ్వకపోగా, రాత్రి 8 గంటల వరకు విలేజ్ క్లినిక్ లలో ఉండాలని ఆదేశాలిస్తున్నారని, అప్పటివరకు ఉండి తాము ఇళ్లకు ఎలా వెళ్లాలని వారు ప్రశ్నించారు. ప్రతినెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ అందజేయాలని, ప్రతి సంవత్సరం ఐదు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేసి, పెండింగ్లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షులు కార్తీక్, కార్యదర్శి నందీశ్వర నాయుడు, చందన ,వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఎన్ఎస్‌పిఆర్ విద్యార్థిని

ప్రజాశక్తి-హిందూపురం

మదీహ

హిందూపురం ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న ఏ.మదీహ అంతర్జాతీయ సదస్సుకు ఎంపికైనట్లు ఆకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రగతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కర్ణాటక మంగళూరు యెనుపోయో విశ్వవిద్యాలయంలో ఈ నెల 15,16 వ తేదీలలో "ఐకాన్ యూత్-2025" పేరుతో రెండు రోజులు పాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు ఎన్ఎస్ఎస్ విభాగం నుండి మదీనా ఎంపికైనట్లు తెలిపారు. జేఎన్టీయూ, ఎస్కే యూనివర్సిటీల నుండి ఆంధ్రప్రదేశ్ టీమ్ గా ఎంపికైన నలుగురు విద్యార్థులలో, తమ కళాశాల విద్యార్థి చోటు సంపాదించడం గర్వకారణమన్నారు. పట్టణంలోని చైతన్య నగర్ లో నివాసముంటున్న జాకీర్ భాష, ముభాషిర దంపతుల కుమార్తె మదీహ ఇదివరకే కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నుండి రెండుసార్లు జిల్లా స్థాయి వకృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో విజేతగా నిలిచి శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ నుండి ప్రశంసలందుకుందన్నారన్నారు. అంతర్జాతీయ సెమినార్ కి ఎంపికైన విద్యార్థినిని కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ యం. నరసింహులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సహచర విద్యార్థులు పట్టణవాసులు అభినందించారు.

రీ సర్వే గ్రామాల్లో ఆర్డీవోలు పర్యవేక్షించాలి : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో రీ సర్వే జరిగే గ్రామాల్లో సంబంధిత ఆర్డీవోలు స్వయంగా పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్లతో రీ సర్వేపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో జెసి తో పాటు డిఆర్ఒ విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో మొదట విడత 32 గ్రామాల్లో పైలట్ క్రింద రీ సర్వే జరిగిందన్నారు. రెండవ విడత 23 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఏప్రిల్ నెల 23 నుంచి సర్వే చేపట్టడం జరుగుతోందన్నారు. రీ సర్వే పనులు ఎలా జరుగుతున్నాయో ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. రెవిన్యూ, సర్వే బృందం టీంలుగా ఏర్పడి విజయవంతం చేయాలని తెలిపారు. ఆర్డీవోలు స్వయంగా పరిశీలించి రీ సర్వే వేగవంతం చేయాలన్నారు. భూ సేకరణ చేసిన రైతులకు పరిహారం అందించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

అవిశ్వాసం పెట్టి అభాసు పాలైన అధికార పార్టీ

ఖాళీగా ఉన్న కౌన్సిలర్ల కుర్చీలు

హాజరుకాని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు సభను వాయిదా వేసిన ప్రొసిడింగ్ అధికారి ముందే చెప్పిన 'ప్రజాశక్తి'

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ వైస్ చైర్మన్-1పై అవిశ్వాస తీర్మాణం పెట్టిన అధికార పార్టీ అభాసుపాలైంది. ఎంపిక విషయంలో కోరం లేక వీగిపోతుందని మూడు రోజుల క్రితమే మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంపిక జరిగేలా అన్న శీర్షికతో ప్రజాశక్తి ప్రత్యేక కథనం రూపంలో ముందే చెప్పింది. చెప్పిన విధంగానే సోమవారం పెనుగొండ సబ్ కలెక్టర్, ప్రొసిడింగ్ అధికారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో వైస్ చైర్మన్-1 ఎంపిక కోసం అవిశ్వాస తీర్మాన సమావేశానికి అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి అధికారులు తప్ప ఎవరూ హాజరుకాలేదు. దీంతో సమావేశాన్ని ప్రొసిడింద్ ఆధికారి ఆనంద్ కుమార్ వాయిదా వేశారు. సోమవారం పెనుగొండ సబ్ కలెక్టర్, ప్రొసిడింగ్ అధికారి ఆనంద్ కుమార్ వైస్ చైర్మన్-1 ఎంపికకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో అవిశ్వాస తీర్మాన సభను ఏర్పాటు చేశారు. అయితే అవిశ్వాస తీర్మానాన్ని ఏర్పాటు చేయాలని కోరిన అధికార పార్టీతో పాటు ప్రతి పక్షంలో ఉన్న వైసిపి కౌన్సిలర్లు ఎవరు కూడా సకాలంలో హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని గంట పాటు ప్రొసిడింగ్ అధికారి వాయిదా వేశారు. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అప్పటికి అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రొసిడింట్ అధికారి ఆనంద్ కుమార్ మీడియా ముఖంగా తెలిపారు. సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్ కు అందజేస్తామని పేర్కొన్నారు.

వీగి పోతామని తెలిసి టిడిపి గైర్హాజరు

మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు, ఓటు హక్కు ఉన్న ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి మొత్తం సభ్యుల సంఖ్య 40. అవిశ్వాసం నెగ్గాలంటే సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది తీర్మానానికి మద్దతుగా ఓటు వేయాలి. ఏడాది క్రితం రాష్ట్రంలో మారిన రాజ కీయాల నేపథ్యంలో 13 మంది వైసిపి, ఒక్క ఎంఐఎం సభ్యురాలు టిడిపిలోకి చేరడంతో ఆ పార్టీ సొంత కౌన్సిలర్ల సంఖ్య 20కి చేరింది. ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు మొదటి నుంచి మద్దతు పలుకుతున్న బిజెపికౌన్సిలర్ తో కలిపి మొత్తం బలం 23కి చేరుకుంది. అయితే అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 27 మంది సంఖ్య బలం కావాలి. అందుకు వైసిపికి చెందిన మరో నలుగురు కౌన్సిలర్ల సమావేశానికి హాజరు అయితే సమావేశం నిర్వహించడానికి సాధ్యం అవుతుంది. అయితే పూర్తి స్థాయి బలం టిడిపికి లేక పోవడంతో అవిశ్వాస తీర్మానానికి లేఖ ఇచ్చిన ఛైర్మన్‌తో పాటు ఆపార్టీకి చెందిన కౌన్సిలర్లు హాజరు కాలేదు. వీరితో పాటు వైసిపి కౌన్సిలర్లు సైతం ఎవరు హాజరు కాక పోవడంతో సమావేశాన్ని ప్రొసిడింగ్ అధికారి వాయిదా వేశారు.

కొనుగోలు రాజకీయాలకు ఇప్పటికైనా స్వస్తి పలకాలి :వైసిపి

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని కొనుగోలు రాజకీయాలకు స్వస్తి పలకాలని వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి దీపికా వేణురెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్-1 పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దీపికా వేణు రెడ్డి, వైస్ చైర్మన్-1 జబివుల్లాతో కౌన్సిలర్లు మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎం లను నమ్ముకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పురపాలక సంఘాలు, స్థానిక సంస్థలను అడ్డదారిన కైవసం చేసుకోవాలని సంతలో పశువులను కొన్నట్లు ప్రజా ప్రతినిధులను కొని తమదే అధికారం అన్నట్టు వ్యవహరించారని విమర్శించారు. డబ్బులకు లొంగకపోతే రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసుకుంటూ పోలీసులను అడ్డంపెట్టి బెదిరింపులకు పాల్పడి స్థానిక సంస్థల్లో అధికారాన్ని కైవసం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇదే విధంగానే హిందూపురం పురపాలక సంఘంలో సైతం అధికారాన్ని కైవసం చేసుకోవాలని భావించారని అయితే ఆ కుట్రలు సాగలేదని అన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందన్న వాస్తవాన్ని బాలయ్యతో పాటు టిడిపి నాయకులు గ్రహించాలన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు షాజియా, నాగేంద్రబాబు, వైసిపి నాయకులు నాగమణి, దాదు, లతీఫ్ సేట్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జూదరులు అరెస్టు.. రూ. 1.28 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-గుడిబండ

కర్నాటక, ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలోని సిసి గిరి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో మడకశిర రూరల్ సిఐ రాజకుమార్, గుడిబండ ఎస్ఐ రాజకుళ్లాయప్ప, పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో 11 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 1,28,000 నగదు, 10 సెల్‌ఫోన్లు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మరో ఇద్దరు పరారైనట్లు, 11 మందిలో ముగ్గురు ఆర్గనైజర్లు ఉన్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-పెనుకొండ

అక్రమంగా రవాణా చేస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓ కారును సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ సజనబాబు తెలిపారు. గోరంట్ల మండలంలోని కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద సోమవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో ఇండికా కారులో అక్రమంగా కర్నాటక మద్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. అయితే నిందితుడు తప్పించుకోగా 24 కర్నాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశామన్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమా రు రూ. 1.08 లక్షలు ఉంటుందన్నారు. పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు. దాడుల్లో ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, హెడ్ కానిస్టేబుళ్లు జనార్దన్, సల్మాన్‌రాజు, రమేష్, హరిప్రసాద్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గార్మెంట్స్ షాపు దగ్ధం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ రెడీమేడ్ గార్మెంట్స్ షాపులో సోమవారం విద్యుత్ సర్క్యూట్ జరిగి పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. తమిళనాడుకు చెందిన వ్యాపారి శ్రీనివాసులు రేకులషెడ్డులో శ్రీనివాస రెడీమేడ్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. అయితే ఉన్నఫళంగా విద్యుత్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన గ్రామపంచాయతీ సిబ్బంది వాటర్ ట్యాంకుల ద్వారా మంటలు ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకడా పోయింది. అప్పటికే దుకాణంలో ఉన్న మొత్తం దుస్తులు కాలి బూడిదవడంతో సుమారు రూ. 30 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు శ్రీనివాసులు తెలిపారు. పగటిపూట ఈ ప్రమాదం జరగడంతో మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపు చేయగలిగారు.

బీమా చెక్కులు అందజేత

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని శిరా రోడ్డులో ఉన్న కెఎంఎఫ్(తుముల్) కార్యాలయంలో సోమవారం 14 మంది రైతులకు పశువుల మరణ బీమా చెక్కులను ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేష్ అందజేశారు. ఓబుళాపురంలో నిర్మించిన పాల డెయిరీ భవనానికి రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో తుముల్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు పిహెచ్.రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్ ఎన్.రవి, విస్తరణ అధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి

ప్రజాశక్తి-పావగడ

సమాజంలో శాంతి, అహింస, సామరస్యం పెంపొందించేందుకు గౌతమ బుద్ధుని ప్రబోధాలు నేటి తరానికి అవసరమని తహశీల్దార్ వరదరాజు తెలిపారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో సోమవారం బుద్ధ జయంతి నిర్వహించారు. ముందుగా తహశీల్దార్ బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బుద్ధుడు రాజు అయినప్పటికీ తన రాజ్యం, వైభవాన్ని త్యజించి సన్యాసిలా జీవించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. బోధి వృక్షం కింద దీర్ఘ తపస్సు చేసి జ్ఞానం పొంది, మానవ జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను అందరికీ పరిచయం చేశాడని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజగోపాల్, విఎ రాజేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప, మంజు, కృష్ణమూర్తి, నాగరాజు, హనుమంతరాయప్ప, రమేష్, నరసింహమూర్తి, రంగనాథ్ పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

బుద్ధ పౌర్ణమి వేడుకలు ప్రశాంతి నిలయం లోని సాయి కుల్వంత్ హాలు లో బౌద్ధ భిక్షకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు సత్యసాయి మహాసమాధి చెంత వారి సంప్రదాయాల మేరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలలో మలేషియా, శ్రీలంక, సింగపూర్, తైవాన్, జపాన్, ఇండోనేషియా, మయన్మార్, థాయిలాండ్, తదితర దేశాలకు చెందిన బౌద్ధ భిక్షులు పాల్గొన్నారు. అనంతరం ఆయా దేశాలకు చెందిన వారు బుద్ధం చరణం గచ్చామి అంటూ చేసిన నత్యాలు అలరించాయి. సత్యసాయి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ వారికి మెమొంటోలు అంద చేసి అభినందించారు.

ఘనంగా మొలకల పౌర్ణమి ఉత్సవాలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని మల్ల మీద పల్లి మునుగలవారిపల్లి తదితర గ్రామాలలో సోమవారం ఘనంగా మొలకల పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించారు. మల్లమీదపల్లి వద్ద కోటూరులో చింతమాను గంగమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

19 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

ఈనెల 19 నుండి ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థులందరు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

జవాన్ మురళీ నాయక్ స్మారక క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ మురళీ నాయక్ స్మారకంగా కోడూరు యూత్ ఆధ్వర్యంలో మే 15న కోడూరు గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు అందజేయనున్నారు. ప్రతి మ్యాచ్‌లో ఉత్తమ ఆటగాడికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు కూడా ఉంటుంది. ప్రతి జట్టు రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా టోర్నీ నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంటులో పాల్గొనేవారు 8142020291, 9704937404 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - నల్లచెరువు

రైతులు తమ పొలాల్లో పంటసాగుకు ముందు భూసార పరీక్షలు తప్పక చేయించాలని ఎఒ భారతి కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోనిఅల్లుగుండు గ్రామంలో భూసారపరీక్షల కొరకు మట్టి సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఎఒ మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఎ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ టిఎస్ చేతన్‌కు సమర్పించారు. ఈసందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఐదుగురు కార్మికులు మూడేళ్ల క్రితం మృతి చెందారన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం క్రింద పారిశుధ్య కార్మికులుగా తీసుకోవాల్సి ఉందన్నారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కార్మికులు రామాంజనేయులు, లక్ష్మీదేవి, సాయి కష్ణ, నాగేంద్ర, జయలక్ష్మి దేవి తదితరులు పాల్గొన్నారు.